సాక్షి ఆదిలాబాద్

బుధవారం | 16 | ఏప్రిల్ | 2025



జీవాల పెంపకానికి చేయూత

మాంసం ఉత్పత్తి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం జీవాల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. గొర్రెలు, మేకల పెంపకానికి గాను ఔత్సాహికులకు సబ్సిడీపై రుణాలు అందజేస్తోంది. 8లో▸



జొన్న కోతలు ముమ్మరం

జిల్లాలో జొన్న పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత కారణంగా రైతులు హార్వెస్టర్లతో ఈ ప్రక్రియ చేపడుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0/27.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు ఇద్దరు జడ్జిల నియామకం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకు బదిలీపై ఇద్దరు జడ్జిలు రానుండగా ప్రస్తుతం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న డాక్టర్ శివరాం ప్రసాద్ జిల్లా మొదటి అదనపు జడ్జిగా బదిలీ అయ్యారు. గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఫ్యామిలీ కోర్టు జడ్జి పోస్టు ఎట్టకేలకు భర్తీ కానుంది. కరీంనగర్ జిల్లా ఫ్యామిలీ కోర్టులో పని చేస్తున్న జడ్జి పి.లక్ష్మి ఇక్కడికి బదిలీపై రానున్నారు. అలాగే కరీంనగర్‌లో స్పెషల్ జడ్జి ఫర్ ట్రైబల్, ఏసీబీ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న కుమార్ వివేక్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా బదిలీపై రానున్నారు. ఈ బదిలీలకు సంబంధించి హైకోర్టు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యూడైస్‌లో తప్పులుంటే సవరించుకోండి

ఆదిలాబాద్‌టౌన్: యూడైస్‌లో తప్పులుంటే సవరించుకోవాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి జె.నారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఖిల్లా)ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 15 నుంచి ఐదు రోజుల పాటు డైట్ ఛాత్రోపాధ్యాయుల ద్వారా యూడైస్ సమాచారాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు గుర్తించిన తప్పిదాలను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాగిన్‌లో సవరించుకోవాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ సీఆర్పీలు, ఎంఈవోలు, ఎమ్మార్పీ సిబ్బంది సకాలంలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు.

బల్దియాలో ప్రత్యేక కౌంటర్



దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అందించేందు కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ (ఈబీసీ) దరఖాస్తుదారులు తమ ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ కాపీలను జత చేసి ఈ కౌంటర్‌లో అందజేయాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎస్.రాజు సూచించారు.

విధుల్లో చేరిన పీపీ



అదనపు జిల్లా జడ్జికి జాయినింగ్ లెటర్ అందజేస్తున్న పీపీ ప్రవీణ్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల నియమితులైన బి.ప్రవీణ్ కుమార్ మంగళవారం విధుల్లో చేరారు. జిల్లా కోర్టులో అదనపు జిల్లా జడ్జి డాక్టర్ పి.శివప్రసాద్‌ను కలిసి తన నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఇందులో ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి, అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. సంజయ్ కుమార్, ప్రభుత్వ ప్లీడర్ దయాకర్, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహీం, న్యాయవాదులు తదితరులున్నారు.

‘బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ జయప్రదం చేయాలి’

నేరడిగొండ: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కోరారు. మండల కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శివారెడ్డి, మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూభారతి వచ్చేసింది

- ‘ధరణి స్థానంలో అందుబాటులోకి..
- కలెక్టర్, ఆర్డీవోలకు అధికారం
- ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం
- 17 నుంచి అవగాహన సదస్సులు



కైలాస్‌నగర్: భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూ భారతి (రికార్డ్స్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం -2025 అమల్లోకి వచ్చింది. ధరణిలో లేనటువంటి పలు అంశాలను పరిష్కరించేలా కొత్త చట్టంలో నిబంధనలను రూపొందించింది. ఏ సమస్యను ఎవరు.. ఎన్ని రోజుల్లో పరిష్కరించాలి.. అది పరిష్కారం కాకుంటే ఎలా అప్పీల్‌కు వెళ్లాలనే దానిపై స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. సీసీఎల్ఏకు వెళ్లే అవకాశం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునే విధంగా ఆర్డీవో, కలెక్టర్‌కు అధికారాలను అప్పగించింది. భూ సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా గైడ్ లెన్స్ విడుదల చేసిన ప్రభుత్వం వాటిని రైతులకు తెలియజేసే దిశగా ముందుకు సాగుతుంది. కొత్త చట్టం అమలుపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ రాజర్షి షా మంగళవారం సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 17నుంచి 30వ తేదీ వరకు అన్ని మండలాల్లో నూతన చట్టంపై అవగాహన కార్యక్రమాలు కల్పించేలా షెడ్యూల్ విడుదల చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, తాగు నీటి ఎద్దడి వంటి అంశాలపై సమీక్షించారు. ఇందులో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌వోఆర్‌లో తప్పుల సవరణకు..

- భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు గాను అర్హులైన వారు నూతన చట్టం వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- కలెక్టర్, ఆర్డీవో ఈ దరఖాస్తులను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారు.
- అభ్యంతరాలుంటే కలెక్టర్, భూమి ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకోవచ్చు.

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ అండ్ మ్యుటేషన్

- రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకే రోజు ఉంటుంది. కొనుగోలు, దానం, తనఖా బదిలీ, భాగ పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేసి పట్టాదారు పాసు పుస్తకం జారీ చేస్తారు.
- స్లాట్ బుకింగ్, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఫీజు చెల్లింపు వంటి నిర్ణీత తేదీల్లో చట్టం ప్రకారం సొంత దస్తావేజు రాసుకుని సమర్పించాలి. దస్తావేజుతో పట్టా, ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నుంచి భూమి పటం సమర్పించాల్సి ఉంటుంది.

17 నుంచి అవగాహన సదస్సులు

భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ నెల 17నుంచి 30వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. మండలాల వారీగా షెడ్యూల్ సిద్ధం చేశారు. ఉదయం ఒక మండలం, మధ్యాహ్నం మరో మండలంలోని రైతులకు అవగాహన కల్పించనున్నారు.

వారసత్వ భూములకు మ్యుటేషన్ ఇలా..

- వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డులో మ్యుటేషన్ చేస్తారు. నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయకుంటే ఆటోమెటిక్‌గా మ్యుటేషన్ అవుతుంది. దీని ద్వారా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం లభించనుంది.

సాదాబైనామాల క్రమబద్ధీకరణ

- పీవోటీ, ఎల్‌టీఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘన లేదని నిర్ధారించుకుంటారు.
- క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.100 అపరాధ రుసుంను వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు. హక్కుల రికార్డులో వివరాలు నమోదు చేసి పాస్‌బుక్ జారీ చేస్తారు. ధరణిలో వీటిపై ఎలాంటి నిబంధన లేకపోవడంతో హైకోర్టు వీటిపై స్టే విధించింది.

మండలాల వారీగా వేదికల వివరాలు..

మండలం	తేదీ	వేదిక
భీంపూర్, తలమడుగు	17	ఉండంలోని ఫంక్షన్‌హాల్
మావల	19	--
బోథ్	22	ధన్నూర్
సోనాల	22	తహసీల్దార్ కార్యాలయ సమీపంలో
ఇంద్రవెల్లి	23	మార్కెట్‌యార్డు
ఉట్నూర్	23	బీఎడ్ కళాశాల
బజార్‌హత్నూర్	24	ఫంక్షన్ హాల్
గుడిహత్నూర్	24	ప్రభుత్వ ఉన్నత పాఠశాల
గాదిగూడ	26	ఆశ్రమ పాఠశాల
నార్నూర్	26	ఫంక్షన్‌హాల్
ఇచ్చోడ,సిరికొండ	27	ఇచ్చోడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల
ఆదిలాబాద్‌రూరల్	28	యాపల్ గూడ ఫంక్షన్ హాల్
తాంసి	28	తాంసి ఉన్నతపాఠశాల
సాత్నాల	29	కాన్పుమేడిగూడ ఉన్నత పాఠశాల
భోరజ్	29	పిప్పర్‌వాడ ఫంక్షన్‌హాల్
బేల	30	ఫంక్షన్‌హాల్
జైనథ్	30	మోడల్ స్కూల్

- భూ భారతి పోర్టల్‌లో నిర్దేశించిన నమూనాలో దరఖాస్తుదారు ఎకరానికి మ్యుటేషన్ ఫీజు రూ.2500 రుసుం చెల్లించాలి. దరఖాస్తుతో పాటు వారసుల ఒప్పంద పత్రం లేదా వీలునామా కాపీ, ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నుంచి భూమి సర్వే పటం కూడా జత చేయాలి.
- తహసీల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే గడువు తర్వాత ఆటోమెటిక్‌గా మ్యుటేషన్ అవుతుంది.
- భూ హక్కు కలిగిన రైతులందరికీ రూ.300 ఫీజుతో పాస్‌బుక్ జారీ చేస్తారు.

ఈవీ.. మనకేవి?

- రీజియన్‌కు ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించని ఆర్టీసీ
- పర్యావరణహిత ప్రయాణానికి ఉమ్మడి జిల్లా వాసులు దూరం
- అందుబాటులోకి వస్తే ప్రయోజనం



ఎలక్ట్రిక్ బస్సులు

ఆదిలాబాద్: ఆర్టీసీ యాజమాన్యం ఇటీవల ఎలక్ట్రిక్ బస్సులపై దృష్టి సారించింది. పర్యావరణహితంగా ఉండడం, కొద్దిపాటి సమయం చార్జింగ్ చేస్తే వందల కిలోమీటర్లు ప్రయాణించడం, ఎలాంటి శబ్ద కాలుష్యం లేకుండా రహదారిపై రయ్యిమంటూ ప్రయాణిస్తుండడంతో సంస్థ ఈ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే వీటిని కేటాయించిన డిపోలలో ఎలాంటి సమస్యలు లేకుండా నడుస్తుండడంతో మరిన్ని బస్సులు కేటాయించేలా ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే పలు రీజియన్లలో ఈ వాహనాలు ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, డీలక్స్, సెమీడీలక్స్ సేవలను అందిస్తున్నాయి. అయితే ఆదిలాబాద్ రీజియన్‌కు వీటి కేటాయింపుల విషయంలో సంస్థ నిర్లిప్త వైఖరి ప్రదర్శిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దూరమే.. భారమా..

ఎలక్ట్రిక్ వాహనాల్లో ముందుగా సూపర్ లగ్జరీ సేవలను ప్రారంభించారు. అనంతరం ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సెమీడీలక్స్ బస్సులుగా పలు రీజియన్లలో నడుపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విషయానికి వస్తే మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం జిల్లా కేంద్రాల నుంచి కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు రాకపోకలు అత్యధికంగా ఉంటాయి. ఈ రూట్లలో సూపర్ లగ్జరీ, లహరి వంటివి విజయవంతంగా నడుస్తున్నాయి. అయితే ఈ రూట్లలో విద్యుత్ బస్సుల ఏర్పాటు విషయంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. ఒక ఎలక్ట్రిక్ బస్సును చార్జింగ్ చేస్తే సుమారు 300 నుంచి 360 కిలోమీటర్ల వరకు నడపవచ్చు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ సుమారు 350 కిలోమీటర్లు ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే గమ్యస్థానానికి చేరేవరకు సర్వీసు నడిచే అవకాశం ఉంది. అయితే ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తినా, చార్జింగ్ అయిపోతే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతాయనే అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, చార్జింగ్ స్టేషన్లు నిర్దేశిత ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే ఈ సమస్య పరిష్కారం అయ్యి రీజియన్ పరిధిలో సైతం ఎలక్ట్రిక్ వాహనాలను నడపవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

విజయవంతంగా నడుస్తున్నా..

కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ రీజియన్లలో ఆర్టీసీ విద్యుత్ బస్సులను విజయవంతంగా ఆపరేట్ చేస్తుంది. ఇటీవలే నల్లగొండ రీజియన్ కు కూడా సుమారు 70 బస్సులను కేటాయించినట్లు సమాచారం. వీటిపై ప్రయాణికుల నుంచి సైతం ఆదరణ పెరుగుతుండడంతో వాహనాల సంఖ్య పెంచుతున్నారు. ప్రధానంగా రద్దీరూట్లలో ఈ సర్వీసులు ఎంతగానో ఉపయోగంగా ఉంటున్నాయని స్వయంగా ఆర్టీసీ అధికారులే పేర్కొంటున్నారు. ప్రభుత్వం సైతం ఈ ఎలక్ట్రిక్ వాహనాలకు అనుమతులు జారీ చేస్తూ సంస్థ ఈ బస్సులను ప్రవేశపెట్టేలా ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులతో పోలిస్తే ఇవి సౌకర్యవంతంగా ఉంటున్నాయి. అలాగే సంస్థపై డీజిల్ భారంభారీగా తగ్గుతోంది.

ఎలక్ట్రిక్ బస్సులు నడపాలి..



ఎలక్ట్రిక్ బస్సులు పర్యావరణహితంగా ఉంటున్నాయి. అలాగే డీజిల్ బస్సులతో పోలిస్తే ఇవి మరింత సౌకర్యవంతంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణించినప్పుడు చాలా బాగా అనిపించింది. ఎలాంటి శబ్దం లేదు. కుదుపులు లేవు. ఆదిలాబాద్ రీజియన్‌లోనూ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– తబ్రేజ్, ప్రయాణికుడు, ఆదిలాబాద్

దూరమే అసలు కారణం..

ఆదిలాబాద్ రీజియన్‌కు ఇప్పటివరకైతే ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించలేదు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వంటి ప్రాంతాలకు దూరం ఎక్కువగా ఉంటుంది. ఇదే అసలు కారణంగా భావిస్తున్నాం.

– ప్రణీత్ కుమార్, ఇన్‌చార్జి రీజినల్ మేనేజర్

అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు

- జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపితే మతాల ప్రాతిపదికన ఆమోదించలేమని కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ పెంపు, భవిష్యత్ కార్యాచరణపై బీసీ కుల సంఘాలతో స్థానిక బీసీ సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. అయితే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాత్రం బీసీల్లో ముస్లింలున్నారని, మత ప్రాతిపాదికన రిజర్వేషన్లను పెంచలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమిళనాడులో చేపట్టిన తరహాలో తెలంగాణలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అశోక్, శ్రీనివాస్, రవీందర్, ఎంప్లాయీస్ యూనియన్ కన్వీనర్ శ్రీనివాస్, కోకన్వీనర్ నవీన్ యాదవ్, కోశాధికారి మురళి, మహిళా సంఘం నాయకురాళ్లు రమ, ఉమామహేశ్వరి, పద్మావతి, యువజన సంఘం కన్వీనర్ నరేశ్, ప్రశాంత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నీటితో విన్యాసాలు ప్రదర్శిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆకట్టుకున్న విన్యాసాలు

ఆదిలాబాద్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భా గంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీ పంలో ఫైర్ సిబ్బంది నీటితో విన్యాసాలు చేపట్టారు. అగ్నిప్రమాదా లను ఏవిధంగా అరికట్టా లనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్ జైత్‌రాం, అగ్నిమాపక సిబ్బంది యజ్ధాని, వినోద్ పాల్గొన్నారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. మార్కెట్ యార్డుతో పాటు సిరిచెల్మ చౌరస్తా, అంబేడ్కర్, కుమురంభీం చౌక్‌లలో వ్యాపారులు, దుకాణాల యజమానులకు కరపత్రాలు పంపిణీ చేశారు. బస్టాండ్ వద్ద నీటి విన్యాసాలను ప్రదర్శించారు. ఇందులో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎం.అశోక్, లీడ్ ఫైర్‌మన్ దేవేందర్, ఫైర్‌మెన్ విజయ్‌కుమార్, అంజు, అచ్యుత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోళ్లు

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో జొన్నల కొనుగోళ్లు చేపట్టనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జొన్నల కొనుగోలు ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆదిలాబాద్, జైనథ్, బేల, తాంసి, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, ధన్నూర్, సిరికొండ, ఇంద్రవెల్లి, శ్యాంపూర్, హస్నాపూర్, నార్నూర్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఇందులో బోథ్, ధన్నూర్‌లో ఇప్పటికే కేంద్రాలను ప్రారంభించామని, మిగతా చోట్ల త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఎకరానికి 8.65 క్వింటాళ్లను రూ.3,771 మద్దతు ధర చొప్పున కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. అలాగే జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటుతో పాటు మార్కెటింగ్, రెవెన్యూ, పోలీసు శాఖ ద్వారా విజిలెన్స్ టీమ్ ఏర్పాటు చేసి సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమంగా జొన్నలు రాకుండా చూడాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఏవో శ్రీధర్ స్వామి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థినులకు నాప్కిన్స్ అందజేసిన కలెక్టర్, అధికారులు, సంస్థ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పింకీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థినులు రుతుక్రమం సమయంలో వచ్చే ఇబ్బందులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పా టించాలని సూచించారు. కార్యక్రమంలో డీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఐసీ డీఎస్ ఇన్‌చార్జి పీడీ మిల్కా, సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, నారాయణ, సుజాత్‌ఖాన్, డీసీఈబీ కార్యదర్శి గజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సమీక్ష

కైలాస్‌నగర్: జిల్లాలోని 33 ప్రభుత్వ పాఠశాలలు, ఏడు జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థినులకు రెండు నెలలకు అవసరమైన శానిటరీ పాడ్స్‌ను ఉచితంగా అందించేందుకు పింకీస్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాలేజీ ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లతో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకే కాకుండా సమాజంలో ఉన్న ప్రతీ మహిళకు నారీ సమ్మాన్ పేరిట ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అనిల్ గుప్తా, కార్యదర్శి షాలిని గుప్తా, డీఐఈవో గణేష్ జాదవ్, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీడబ్ల్యూవో మిల్కా తదితరులు పాల్గొన్నారు.

‘ఓపెన్’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై డీఈవో కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈనెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు 518 మంది, ఇంటర్ పరీక్షలకు 395 మంది అభ్యాసకులు హాజరుకానున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల కోసం మూడు కేంద్రాలు, ఇంటర్ పరీక్షల కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యాసకులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు మినహాయింపు ఉందని, ఆ తర్వాత అనుమతించమని స్పష్టం చేశారు. అలాగే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 26 నుంచి మే 3వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొమ్మిది మంది బైండోవర్

నెన్నెల(బెల్లంపల్లి): పేకాడుతూ పట్టుబడిన ఐదుగురిని, గంజాయి సేవిస్తూ పట్టుబడిన మరో నలుగురిని మంగళవారం తహసీల్దార్ మహేంద్రనాథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇకపై మంచి మార్గంలో నడుచుకోవాలని వారికి సూచించినట్లు పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించి ఇదే నేరాన్ని మరోసారి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

కడెం(ఖానాపూర్): మండలంలోని లింగాపూర్‌లో పడాల గంగవ్వ అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. గంగవ్వ ఇటీవల మండలంలోని పాత మద్దిపడగలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లింది. ఈనెల 14న రాత్రి దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. మంగళవారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు వృద్ధురాలికి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, క్లూస్‌టీం సిబ్బంది ఇంటిని పరిశీలించారు. ఇంట్లో ఉన్న రెండు బీరువాలను పగులగొట్టి మూడు తులాల బంగారం, పది తులాల వెండి కడియాలు, రూ.15 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడ్‌చాందలో..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఈ నెల 13న లక్ష్మణ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చే చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామగ్రి చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులో ఉన్న 3 తులాల బంగారం, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో రెండిళ్లలో..

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాజులపేట్ కాలనీలో గల షేక్ సాబీర్ ఈనెల 14న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న మూడు తులాల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అదే ఇంటిపక్కన ఉన్న మహ్మద్ అన్వర్ అహ్మద్ ఇంటితాళం పగులగొట్టిన దొంగలు బీరువాలోని రూ.6వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు దోచుకెళ్లారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు.

జీవాల పెంపకానికి చేయూత

- ఎన్‌ఎల్‌ఎం ద్వారా రుణాలు
- యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ
- గరిష్టంగా రూ.50 లక్షల వరకు మంజూరు

యూనిట్ సబ్సిడీ

(గొర్రెలు,పొట్టేళ్లు)	(రూ.లక్షల్లో)
500-25	50
400-40	40
300-15	30
200-10	20
100-05	10



లక్ష్మణచాందలో గొర్రెల మంద

లక్ష్మణచాంద(నిర్మల్): దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మాంసం ఉత్పత్తులు పెంచాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. మాంసానికి ఉన్న డిమాండ్ దృష్ట్యా జీవాల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గొర్రెలు, మేకల పెంపకానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ స్కీం(ఎన్‌ఎల్‌ఎం) ద్వారా ఔత్సాహికులకు సబ్సిడీ రుణాలు అందిస్తోంది. 2021–22లో ప్రారంభించిన ఈ పథకాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అమలు చేస్తోంది. ఈ పథకం కింద పెంపకందారులకు ఒక్కో యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు జిల్లా పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. యూనిట్ మంజూరైనప్పటి నుంచి పూర్తిస్థాయిలో సబ్సిడీ నిధులు విడుదలయ్యే వరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షిస్తుందని అధికారులు తెలిపారు. గరిష్టంగా యూనిట్‌కు రూ.50 లక్షల వరకు రుణం అందించనున్నారు. ఈ రుణం డబ్బులను రెండు విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

దరఖాస్తు ఇలా..

గొర్రెలు,మేకల యూనిట్ల పెంపకం రుణం మంజూరు కోసం www. nim. udyamimitra. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఈ రుణాలు పొందడానికి దరఖాస్తు చేయడానికి ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని అధికారులు అంటున్నారు. రుణం మంజూరుకు దరఖాస్తు చేస్తున్న ఉత్సాహవంతులు తమ పాన్, ఆధార్ కార్డు, అడ్రస్ ప్రూఫ్, పాస్‌ఫొటో, రుణం తీసుకునే బ్యాంకు స్టేట్‌మెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.

అర్హతలు

1. కనీసం ఐదెకరాల వ్యవసాయ భూమిని కలిగి ఉండాలి. ఇతరులదైనా లీజుకు తీసుకోవాలి.
2. పశు పోషణలో తగిన అనుభవం ఉండాలి.
3. యూనిట్ మంజూరు కోసం బ్యాంక్ కాన్సెంట్ తీసుకోవాలి.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకాన్ని గొర్రెలు, మేకల పెంపకంపై ఆసక్తి ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలి. ఈ దరఖాస్తు చేసుకుని యూనిట్ పొంది ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. వివరాల కోసం జిల్లా కార్యాలయంలో సంప్రదించాలి.

– ఎండీ బాలిగ్ అహ్మద్, జిల్లా పశువైద్యాధికారి, నిర్మల్

పెళ్లి ఘడియలు

- మూడు నెలలపాటు శుభ ముహూర్తాలు



దండేపల్లి(మంచిర్యాల): ముహూర్తాల కోసం వేచి చూస్తున్న వారికి తీపి కబురు అందింది. మండు వేసవిలో శుభఘడియలు వచ్చాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో శుభ ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో తెలుగింట 'రారండోయ్..వేడుక చేద్దాం' అంటున్నారు. వరుసగా మంచిరోజులు రావడంతో పెళ్లి మండపాలు, బ్యాండ్‌మేళాలకు డిమాండ్ ఏర్పడింది. పురోహితులు, వంట మనుషులు, వీడియోగ్రాఫర్లకు, ఆర్డర్లు తలుపు తడుతున్నాయి.

ముహూర్తాలు ఇవే..

ఏప్రిల్‌లో 16, 18, 20, 23, 30 తేదీల్లో, మే నెలలో 1, 4, 8, 9, 10, 11, 14, 16, 18, 21, 23, 28, 30, 31 తేదీల్లో, జూన్ నెలలో 2, 4, 5, 6, 7, 8 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. జూన్ 11 నుంచి జూలై 12 వరకు మూఢం రావడంతో ముహూర్తాలకు కొంత విరామం వచ్చింది. తిరిగి మళ్లీ శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు మొదలు కానున్నాయి. ఏదిఏమైనా ఈ ఏడాది విశ్వావసు నామ సంవత్సరంలో శుభముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో పెళ్లిళ్ల కూడా ఎక్కువగానే జరుగనున్నాయి.

మూణ్నెళ్లు శుభఘడియలు



మూడు నెలలపాటు ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు జరుపుకోవడం చాలా మంచిది. ముఖ్యంగా ఈ నెల 30న అక్షయ తృతీయ రావడంతో ఆరోజు దివ్యమైన ముహూర్తం ఉంది. నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నవారు వేడుకలకు సిద్ధమవుతున్నారు.

– గొల్లపెల్లి రామానందాచార్య స్వామి, వేదపండితులు

ఆర్టీసీ డ్రైవర్‌కు 18 నెలల జైలు

శ్రీరాంపూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు 18 నెలల జైలుశిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల స్పెషల్ జ్యూడిషియల్ కోర్టు జడ్జి డీ.ఉపనిషద్వని మంగళవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై సంతోశ్ తెలిపారు. 2017, నవంబర్ 06న శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న పోతనవేణి మల్లమ్మను ఏ.సంతోశ్‌కుమార్ అజాగ్రత్తగా బస్సు నడుపుతూ ఢీకొట్టాడు. గాయపడిన మల్లమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కటిక రవిప్రసాద్ కేసు నమోదు చేశారు. మంగళవారం 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

లారీ కిందపడి యువకుడు మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు, రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన చెందిన కృష్ణ (24)మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై భైంసావైపు వెళ్తుండగా చిట్యాల బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. దీంతో యువకుడు లారీ చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో దిలావర్‌పూర్ మండలంలోని కాలువ తాండ నుంచి బైక్‌పై వస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజు, రాకేష్ ఆగి ఉన్న అదే లారీని వెనుకనుంచి ఢీ కొట్టి కిందపడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

నస్పూర్: పట్టణ పరిధిలోని దొరగారిపల్లె వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి తెల్లవారుజామున దొరగారి పల్లె వద్ద జాతీయ రహదారి 363 దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు టీ షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. వివరాలకు 8712656539 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మహారాష్ట్ర ప్రమాదంలో జిల్లా యువకుడు..

తాంసి(బోథ్): మహారాష్ట్రలో జరిగిన ప్రమాదంలో జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భీంపూర్ మండలం జల్ కోరి పంచాయతీ పరిధిలోని లీంగూడకు చెందిన ఆత్రం రాము (18) సోమవారం సాయంత్రం తన మిత్రుడితో మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్ బయలుదేరాడు. జరూర్ గ్రామ సమీపంలో కొందరు రోడ్డు పక్కన ఉన్న చెట్లను కొడుతుండగా కొమ్మలు వచ్చి యువకులు వెళ్తున్న బైక్‌పై పడ్డాయి. ఘటనలో రాముకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు రాజుకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్రలోని మాండ్వి పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆత్రం రాము (ఫైల్)

దైవదర్శనానికి వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి, కుమారుడికి గాయాలు



సంఘటన స్థలంలో రాజు మృతదేహం

దిలావర్‌పూర్(నిర్మల్): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఎల్.సందీప్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన దిద్దోలి రాజు (45) కుటుంబం నర్సాపూర్(జి) మండలంలోని అర్లి వద్ద ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం తెల్లవారు జామున రాజు భార్య, ఇద్దరు పిల్లలు ఆటోలో పంపించారు. రాజు, అతని కుమారుడు కేదార్‌నాథ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తిరుగుప్రయాణంలో దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ సమీపంలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందగా కేదార్‌నాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని కేదార్‌నాథ్‌ను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాహనంలో తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సోన్(నిర్మల్): మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గోపి తెలిపారు. మృతుని వయస్సు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, తల వెంట్రుకలు పొడవుగా ఉన్నాయని, వేసుకున్న బట్టలు మాసిపోయి ఉన్నాయన్నారు. కడ్తాల్ మాజీ సర్పంచ్ బర్మా రాజానర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

సారంగపూర్(నిర్మల్): మండలంలోని యాకర్‌పెల్లి గ్రామానికి చెందిన నిర్మల రాజు(41) రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. బెబ్లాలీ ఏరియాలో గల వేడామ్స్ కంపనీలో కూలీపనులు చేస్తున్నాడు. నెలరోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో తోటి ఉద్యోగులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 7న మృతి చెందాడు. మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ఎడారి దేశంలో దిక్కుతోచని స్థితిలో జీవి విడిచావు.. ఇక్కడికి వచ్చినా మేము కాపాడుకునేవాళ్లం.. ఇప్పుడు పిల్లలను ఎలా సాకాలయ్యా.. అని మృతుని భార్య రుక్మవ్వ రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతునికి భార్య రుక్మవ్వ, కుమారుడు అఖిల్, కుమార్తె శృతి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ 61వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దిలావర్‌పూర్ మండలం ఒడ్డేపల్లికి చెందిన కుంచపు సురేష్ తన భార్య గంగామణి, ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై కుందాపూర్ ఎల్లమ్మ వద్దకు వెళ్లి వస్తుండగా నర్సాపూర్(జి)కి చెందిన జావేద్, తన కుమారుడితో కలిసి బైక్‌పై దిలావర్‌పూర్ బయలుదేరాడు. మార్గమధ్యలో జాతీయ రహదారిపై సురేష్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఘటనలో గంగామణి, జావేద్, అతని కుమారుడికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

500 దేశీదారు సీసాలు స్వాధీనం



దేశీదారు, నిందితుడితో ఎక్సైజ్ సీఐ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని భీంసరిలో 90 ఎంఎల్ పరిమాణంలో ఉన్న 500 దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భీంసరి గ్రామానికి చెందిన అలిశెట్టి అభిలాష్ మహారాష్ట్రలోని చనాక నుంచి ద్విచక్ర వాహనంపై దేశీదారు తీసుకువస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.18వేలు ఉంటుందన్నారు. ఎవరైనా దేశీదారు, నాటుసారా విక్రయిస్తే రూ.లక్ష జరిమానాతో పాటు పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 54వ సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో 20 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 80 మంది మహిళా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా 20 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మంచిర్యాల జిల్లాలోని మందమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్, పీడీ, పీఈటీలు రవి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



మెమొంటో అందుకుంటున్న రామ్ అక్షరేష్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన నామని రమేశ్ కుమార్, మౌనిక దంపతుల కుమారుడు రామ్ అక్షరేష్ 8 నిమిషాల్లో 300ల పదాలను పఠించడం ద్వారా వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నాడు. ఎల్‌కేజీ చదువుతున్న రామ్ అక్షరేష్ తెలుగు సంవత్సరాలు, నెలలు, తిథులు, రాష్ట్ర రాజధానులు, జాతీయ చిహ్నాలు, గ్రహాలు, ఆవిష్కరణలు, చారిత్రాత్మక కట్టడాలతో సహా 300ల వరకు 8 నిమిషాల్లోనే పఠించడం ద్వారా రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు భారత దేశ ప్రతినిధి బింగి నరేంద్ర గౌడ్, తెలంగాణ కోఆర్డినేటర్లు డాక్టర్ వేణుకుమార్, కే.రవికుమార్ చిన్నారికి మెమొంటో అందజేశారు.

అమ్మా.. క్షమించు

- అన్నయ్యా.. సారీ..
- నా ఆరోగ్యం మెరుగుపడడం లేదు
- బాధ భరించలేకపోతున్నా'
- సూసైడ్ నోట్ రాసి యువకుడి బలవన్మరణం



అనిల్ (ఫైల్)

నెన్నెల(బెల్లంపల్లి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు చికిత్స చేయించుకున్నా మెరుగు పడకపోవడంతో మనస్తాపం చెందాడు. అనారోగ్యం బాధను భరించలేకపోయాడు. ఇక చావే శరణ్యమనుకున్నాడు. ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటాపూర్‌లో జరిగింది. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చెల్మాటికారి సత్తయ్య, అమృత దంపతుల కుమారుడు అనిల్ (24) పీజీ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా పచ్చకామెర్లు, దవడ బిల్లలు, వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లోనే దూలానికి చీరతో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. ఉరేసుకునే ముందు బెడ్‌రూమ్‌లో అతని మంచంపై సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. 'అమ్మా.. నన్ను క్షమించండి.. నాకు ఆరోగ్యం బాగుండడంలేదు. బాధ భరించలేక చనిపోతున్నా. నా చావుకు ఎవరూ కారణం కాదు. నా సొంత నిర్ణయంతో చనిపోతున్నా. అన్నయ్య సారీ రా... నీవు ఈ లెటర్ చదివే సమయానికి నేను నీతో ఉండను.. అమ్మా నాన్నను కష్టపెట్టకు.. నన్ను మీరంతా క్షమిస్తారని ఆశిస్తూ.. సెలవు తీసుకుంటున్నా.. అని నోట్ రాసి ఉంచాడు. మృతుని తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రదానం

అనిల్ కళ్లు దానం చేయడానికి తల్లిదండ్రులు ముందుకు వచ్చి సోపతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు భీం పుత్ర శ్రీనివాస్, బ్లడ్ డోనర్ అసోసియేషన్ అధ్యక్షుడు రహీమ్‌కు సమాచారం అందించారు. దీంతో వారు హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్‌కుమార్‌కు తెలియజేయడంతో గ్రామానికి వచ్చి నేత్రాలు సేకరించారు.

పోలీసుల పనితీరు భేష్

- 40 నిమిషాల్లోనే దొంగను పట్టుకున్న వైనం



చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఒకరి వద్ద నుంచి రూ.36వేల నగదు అపహరించిన దొంగను కేవలం 40 నిమిషాల్లోనే గుర్తించిన ఆసిఫాబాద్ పోలీసులు భేష్ అనిపించుకున్నారు. సీఐ బుద్దె రవీందర్ తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రానికి చెందిన మీర్ అలీ మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్ వద్ద తన స్కూటీని పార్కింగ్‌లో చేశాడు. డిక్కీలో ఉన్న రూ.36వేల నగదును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు తిరుపతి, సాగర్ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. అతని వద్ద నుంచి రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రవీందర్, ఎస్సై అంజయ్య, బ్లూకోర్ట్ కానిస్టేబుల్ సాగర్, తిరుపతిని ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు, సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ అభినందించారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

దండేపల్లి: మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన కల్లెం సంతోశ్‌పై దాడికి పాల్పడిన లక్కాకుల సృజన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. నర్సాపూర్ సమీపంలోని తాటిచెట్ల వద్ద మొరం డబ్బుల విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. ఈక్రమంలో మాటామాట పెరగడంతో సంతోశ్‌పై సృజన్ కర్రతో దాడిచేయడంతో గాయాలయ్యాయి. బాధితుని తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రహరీ కూల్చిన ఇద్దరికి జైలుశిక్ష

మంచిర్యాలక్రైం: ప్రహరీ, పైపులైన్, గేట్లు కూల్చివేసిన ఇద్దరికి ఆరునెలల సాధారణ జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లో నివసించే లక్సెట్టి మల్లయ్య, అప్పాసు కిషన్, నెల్కి మల్లేశ్, బీ.కిషన్‌కు సంబంధించిన ప్రహరీ, గేట్లు, పైపులైన్‌ను సదానంద గౌడ్, సురేష్ 2020 జూన్1న జేసీబీతో ధ్వంసం చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి...

నిర్మల్‌టౌన్: మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి నిర్మల్ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపారు. భైంసా మండలం సిరాలకు చెందిన మహిళ, భైంసా పట్టణంలోని ఇమ్రాన్ ఒకేచోట పనిచేసేవారు. రెండేళ్ల క్రితం రాజస్థాన్ వెళ్లిన మహిళ భర్త తిరిగిరాలేదు. దీంతో ఇమ్రాన్ ఆమెను లొంగదీసుకునేందుకు యత్నించాడు. 2020, జూన్ 16న రాత్రి మహిళ ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి లైంగికదాడికి యత్నించాడు. ప్రతిఘటించిన మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. సదరు మహిళ భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పున్నంచందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీ.శ్రీనివాస్ పైవిధంగా తీర్పునిచ్చారు.

ముగ్గురు యువకుల రిమాండ్

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రిలో ఈ నెల 13న రాత్రి పంచశీల జెండాలను అవమానపర్చిన ఘటనలో గ్రామానికి చెందిన కొగురు అరుణ్, యాల్ల ఉదయ్‌కిరణ్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు. దర్యాప్తులో ముగ్గురు యువకులు నిందితులుగా తేలడంతో బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

అడవిలో మంటలు

కడెం: మండలంలోని నర్సాపూర్ సమీపంలో మంగళవారం రాత్రి కార్చిచ్చుతో అడవిలో మంటలు వ్యాపించాయి. అటవీ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్తున్నా అడవిలో మంటలు ఆగడం లేదు. సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో తరచూ ఇలాంటి ఘటనలు పునరావృతవుతున్నాయి.